కూడా అడగనక్కరలేదు. ఏమీ అడగకుండానే మీ సందేహాలు తీరిపోతాయి, గురువు సమక్షంలో మీకు బాగుపడాలనే బుద్ధి కలుగుతుంది, మీరు పవిత్రులవుతారు. శాస్త్రంలో ఎన్ని మాటలు చెప్పినా గురువు యొక్క దయ ముందు అన్నీ రెండవ పక్షం. పూర్వజన్మలనుండి మనం చేసుకొన్న పుణ్యం పంటకు వస్తే అప్పుడు ఈశ్వరుడు గురురూపంలో వస్తాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-04-2006, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాముడి అన్నదమ్ముల నుండి మనం నేర్చుకోవలసింది ఐకమత్యం. భరతుడుతల్లి చెప్పడు మాటలు వింది కాని రాముడి అన్నదమ్ములు ఎవరూ చెప్పడు మాటలు వినలేదు. చెప్పడు మాటలు వినటం వలన కుటుంబాలు పాడైపోతాయి. రాముడి అన్నదమ్ముల దగ్గరకు వెళ్ళి ఒకరిమీద ఒకరికి విభేదాలు కలిగించే మాటలు చెప్పినా వారు నమ్మరు, మన కుటుంబాన్ని పాడుచేయటానికి చెపుతున్నారు అని వారు గ్రహించేస్తారు. మంచివారు కూడా చెడు స్నేహాల వలన పాడైపోతారు, కైక మందర మాటలు వినటం వలన పాడైపోయింది. మనం చేసే స్నేహాల విషయంలో, చదివే గ్రంథాల విషయంలో, తినే తిండి విషయంలో, మనకు వచ్చే ఆలోచనల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మన శాంతి ఎవరో ఇతరుల మీద ఆధారపడి లేదు. తాత్కాలికమైన సంతోషాలకోసం, తాత్కాలికమైన ఉద్రేకాలకోసం మనం ఆత్మజ్ఞానాన్ని వదులుకోకూడదు. మనకు వచ్చే తలంపులు ఉద్రేకపూరితంగా ఉంటే భవిష్యత్‌లో మనకు తప్పక అశాంతి వస్తుంది. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ప్రతీ విషయంలోను, ప్రతీక్షణం కూడా జాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు, అవినయం పనికిరాదు.

జైనమత స్థాపకుడు మహావీరుడు. ఆయన పేరు వర్ధమానుడు. ఆయనకు మహావీరుడు అనే బిరుదు, ఆ బిరుదు ఎందుకు వచ్చింది అంటే ఆయన బాహ్యంగా ఏమీ సామ్రాజ్యాలు ఆక్రమించుకోలేదు, ఆయన నూటికి నూరుపాళ్ళు ఇంద్రియాలు, మనస్సును జయించాడు కాబట్టి వర్ధమానుడికి మహావీరుడు అని బిరుదు వచ్చింది. ఆయనకు మహావీరుడు అనే బిరుదు ఎందుకు వచ్చిందో గుర్తు పెట్టుకోండి. ప్రపంచంలోని ఏ ఆకర్షణలు, ఏ భోగాలు ఆయన మనస్సును బాహ్యముఖానికి తీసుకొని రాలేదు, వాడు మహావీరుడు. ఆయన ఒక మాట చెప్పారు ఒకవేళ మీకు మనస్సును జయించటం, ఇంద్రియాలను జయించటం సాధ్యంకాకపోతే అవసరమైతే మీ శరీరాన్ని కొంత శుష్కింపచేసి అయినా ఇంద్రియాలను, మనస్సును మీరు స్వాధీనంలోనికి తెచ్చుకొంటేనే కాని హృదయంలో

ఉన్న అంతర్యామి మీకు ఎరుకలోనికి రాడు అని చెప్పారు. రాముడు అన్నదమ్ములు చిన్న పిల్లలుగా ఉన్నప్పడు నలుగురు కలిసి ఆడుకొనేవారు. ఒకసారి భరతుడు ఏడుస్తూ కౌసల్య దగ్గరకు వచ్చాడు. ఎందుకు బాబు ఏడుస్తున్నావు, ఆటలలో ఓడిపోయావా అని అడిగింది. నేను ఓడిపోతే నాకు దుఃఖం రాదు, నా చేతిలో రాముడు ఓడిపోయాడు అందుకు నాకు దుఃఖం వస్తోంది అని చెప్పాడు. రాముడు కూడా తమ్ముడిని నెగ్గించటం కోసం, వాడి సంతోషం కోసం ఓడిపోవాలనే ఓడిపోయాడు, అది వారి సోదరప్రేమ. మనం పరీక్షలో ఫెయిల్ అయ్యాము అనుకోండి దుఃఖం వస్తుంది. ఆటలలో ఓడిపోయాము అనుకోండి దుఃఖం వస్తుంది. ఎవరైనా అవమానం చేసారు అనుకోండి, మనకు దుఃఖం వస్తుంది. ఇదంతా ప్రపంచమే, ఇదంతా ప్రకృతే. ఒక్క విషయం మీరు గుర్తుపెట్టుకోండి ఈ జయాలు అపజయాలు, గౌరవాలు అగౌరవాలు, సమాజంలో జరిగే ఊరేగింపులు ఇవన్నీ అహంభావనకే కాని లోపలఉన్న చైతన్యానికి వీటితో ఇసుమంతయు సంబంధం లేదు. ఇది మీకు అర్థమైతే జయాపజయాల వలన గాని, లాభనష్టాలవలనకాని మీకు వికారం రాదు, మనోచాపల్యం రాదు. మీకు ఏదైనా కలిసి వచ్చింది అనుకోండి, జయం కలిగింది అనుకోండి దానికి గర్వం వచ్చింది అనుకోండి మీకు జయం కలిగింది అనుకొన్నా మీరు ఓడిపోయిన వారితో సమానము. మీరు బాహ్యంగా నెగ్గారు కాని లోపల కుళ్ళిపోతున్నారు. మీరు లోపల కుళ్ళిపోతూ ఉంటే బాహ్యంగా జయం కలిగినా ఏమిటి ప్రయోజనం? మీకు కలిగే జయాలు లోపల వికారాలను తీసుకొని వస్తూ ఉంటే మీరు నెగ్గినవారితో సమానం కాదు, ఓడిపోయిన వారితో సమానం ఇది మీరు గుర్తు పెట్టుకోండి.

మీకు డబ్బు ఉంటే పది కాసులు బంగారం కొనుక్కోవచ్చు కాని మనస్సును బంగారం చేసుకోవడం చాలా కష్టం. ఎంతో సాధన చేస్తేగాని, గురువు అనుగ్రహం ఉంటే గాని అది సాధ్యం కాదు. నాకు ఆకలిగా ఉంది అనుకోండి, మీరు అన్నం తింటే నా ఆకలి తీరదు, నేను తింటే నా ఆకలి తీరుతుంది. అలాగే నాకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే, అశాంతి వస్తూ ఉంటే మీకు జ్ఞానం రావటం వలన నా దుఃఖం, అశాంతి పోదు. నాకు జ్ఞానం కలిగితే నాలో ఉన్న అశాంతి, దుఃఖం నశిస్తాయి. ఇది సామూహికంగా సాధించేది కాదు, ఏ మనిషికి ఆ మనిషి ఎంతోకొంత కృషి చేయాలి, జిజ్ఞాస ఉండాలి. రావణాసురుడు రాక్షసుడు అనుకొంటాము, కంసుడు రాక్షసుడు అనుకొంటాము. వారు కాదు రాక్షసులు, మనలో ఉన్న రాగద్వేషములే రాక్షసులు. బయట ఉన్న రాక్షసులను జయించటం కంటే మనలో ఉన్న రాక్షసులను జయించటం చాలా కష్టం. వాడిలో ఉన్న రాక్షసులను జయించాడు కాబట్టే, రాగద్వేషాలనుండి పూర్తిగా

విడుదల అయ్యాడు కాబట్టే వర్ధమానుడు మహావీరుడు అయ్యాడు.

ఎవరి దగ్గరమంచి ఉన్నా అది మనం నేర్చుకొంటే మనం బాగుపడతాము. మంచిని నేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తే భౌతికంగా అభివృద్ధిలోనికి వస్తాము, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. ఇది ఒక ఆస్థి కింద మనం జాగ్రత్త పెట్టుకోవాలి. మీ బంగారాన్ని మీరు ఎలా జాగ్రత్త పెట్టుకొంటున్నారో అలా జాగ్రత్త పెట్టుకోండి. మనం పని చేసి కర్మఫలాన్ని ఆశిస్తూ ఉంటాము. ఈ పని చేసాము, ఈ ఫలితం వస్తుంది అని ఆశిస్తూ ఉంటే మనకు పునర్జన్మలు రాకుండా భగవంతుడు కూడా ఆపుచేయలేడు. జీవుడు ఎంతకాలం అయితే కర్మఫలాన్ని ఆశిస్తాడో అంతకాలం వాడు జననమరణ ప్రవాహంలో ఉండవలసిందే, ఆ మాయలో నుండి అజ్ఞానంలో నుండి బయటకు వచ్చే అవకాశం లేదు. మనం ఎప్పడూ ఏదో ఆశించటం వలన అనారోగ్యానికి గురి అవుతాము. పనికి పనే ఫలితం అనుకొన్నప్పడు శారీరకఆరోగ్యం బాగుంటుంది, మానసికఆరోగ్యం బాగుంటుంది. మనం ఏదైనా ఒక మంచి పని చేసాము అనుకోండి ఒకోసారి దానివలన ఫలితం రాకపోయినా మనకు సంతృప్తి మిగులుతుంది. జీవితంలో ప్రతీమనిషికి సంతృప్తి అవసరం. మన సంతృప్తి కోసం అయినా కొన్ని మంచిపనులు చేయాలి, వారి దగ్గర నుండి కృతజ్ఞత కూడా ఆశించనక్కరలేదు. ఆశించటం వలన నీ మనస్సు ఉద్రేకపడుతుంది. ఆశింపు లేకపోతే మనస్సుకు ఉద్రేకం రాదు. ఆశింపు లేనప్పడు నీకు నిరాశ కూడా ఉండదు, నిద్ర సుఖంగా పడుతుంది, నీవు మానసిక అశాంతికి గురి అవ్వవు. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది, ఇది తెలుసుకోవటం కావాలి అని భగవాన్ చెప్పారు. భగవాన్ చెప్పిన ఈ మాటను మననం చేసుకోండి.

ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు వెళ్ళే టైములో మన హృదయంలో ఉన్న శాంతి, ఆనందం నూటికి నూరుపాళ్ళు మనకు అందితే అదే కడసారి జన్మ, ఇంక శవాలను మోయనక్కరలేదు. ఇంకో గంటకు చనిపోతారు అనగా ఈ మధ్య ఒకరిని మీరు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నారా అని నేను అడిగాను. నేను సుఖంగా లేను, ఉన్నానని ఎలా చెపుతాను. నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఎలాగూ లేను, కొంచెం కూడా సుఖంగా లేను అన్నారు అలాగని ఆయనకు బాహ్యంగా ఏమీ లోటు లేదు. దేహంతో తాదాత్మ్యం, మనస్సుతో తాదాత్మ్యం, లోకంతో తాదాత్మ్యం, కులంతో తాదాత్మ్యం, ప్రాంతంతో తాదాత్మ్యం ఇలా నీవు కానిదానితో దేనితో తాదాత్మ్యం పొందినా పరిణామంలో నీకు దుఃఖమే మిగులుతుంది. దేశభక్తిలో ఏముంది అని మీరు అనుకోవచ్చు. దేశభక్తి వలన హృదయం విశాలమవుతుంది, మనస్సు విశాల మవుతుంది, చిత్తశుద్ధి కలుగుతుంది. దేశభక్తి వలన మన మనస్సులో ఏమైనా

మురికి గుంటలు ఉంటే అవి పోతాయి, మనస్సులో ఉన్న ఇరుకుతనం పోతుంది. ఏమతస్థుడు అయినా, ఏ కులస్థుడు అయినా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మోక్షం పొందాలి, చిత్తశుద్ధి లేకుండా మోక్షాన్ని పొందే అవకాశం లేదు. నువ్వు వివేకాన్ని పెంచుకో, వైరాగ్యాన్ని పెంచుకో. నువ్వు జాగ్రత్తగా వివేకాన్ని, వైరాగ్యాన్ని పెంచుకొంటూ వస్తే నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మనం ఎంత సేపు నేను, నాది అంటాము. ఈ నేను అనే ఫీలింగ్, నాది అనే ఫీలింగ్ ఇవి రెండూ పెద్ద గుల్లలు కాని వీటిని మనం బంగారపు కడ్డీలు అనుకొంటున్నాము, అందుచేత వీటిని విడిచిపెట్టలేకపోతున్నాము. రోడ్డు మీద ఉన్న గడ్డి పరకకు ఉన్న విలువ కూడా వీటికి లేదు. వీటిలో నుండి విడుదల పొందకుండా ఎవడికీ బ్రహ్మానుభవం కలుగదు. ఈ నేను, నాది అనేవి ఎంత బలంగా ఉన్నాయి అంటే మనం ఎన్ని సాధనలు చేసినా అందులో నుండి బయటకు రాలేకపోతున్నాము. ఎవడైతే ఈ రెండు ఫీలింగ్స్‌లో నుండి విడుదల పొందాడో, ఇప్పుడు మనకు నేను అనేటప్పటికి దేహము ఎలా స్ఫురిస్తోందో వాడికి నేను అనేటప్పటికి బ్రహ్మం స్ఫురిస్తుంది. ఇంక వాడికి రాకపోకలతో పనిలేదు.

కొంతమందికి పేరు అంటే విపరీతమైన పిచ్చ, ఆ పేరుతో తాదాత్మ్యం. మనం పుట్టినప్పుడు మనం మొఖం మీద పేరు వ్రాసుకొని వచ్చామా, ఎవడో ఆ పేరు పెట్టాడు, అది వేసుకొని తిరుగుతాము, ఆ పేరు అంటే మనకు చాలా ఇష్టం. చందాలు కూడా పేరు కోసమే ఇస్తాము, ఏదో ఒక ఐటమ్‌కు నా పేరు పెట్టండి 4 లక్షలు కాకపోతే 6 లక్షలు ఇస్తాను అని అంటాము, పాపం ఆ పేరులో ఏదో ఉందని వాడికి అనిపిస్తుంది. అది ఒక గుల్ల, అది ఒక డొల్ల అందులో ఏమీ లేదు అని వాడికి తెలియటం లేదు. ఈ నేను అనే తలంపులో, నాది అనే తలంపులో ఏదో ఉంది, ఏదో ఉంది అని ఊహించుకొంటాము, అలా ఊహించుకోవటంలోనే అవి బలపడిపోతున్నాయి. మనం చేస్తున్న సాధనలు ఎలాగ ఉన్నాయి అంటే ఈ సాధనల పేరు మీద వాటిలో నుండి విడుదల పొందటం మాట ఎలా ఉన్నా, నేను, నాది అనే తలంపులు ఇంకా బలపడిపోతున్నాయి. మీకు మిగతా తలంపులు ఎన్ని వచ్చినా దేహము నేను అనే తలంపును కేంద్రంగా చేసుకొని ఇతర తలంపులు అన్నీ వస్తున్నాయి. ఆత్మజ్ఞానసముపార్జన కోసం బుద్ధుడు ఒక మహా సామ్రాజ్యాన్ని విడిచిపెట్టాడు. నేను సామ్రాజ్యాన్ని విడిచిపెట్టాను అనే తలంపుకూడా మనస్సులో ఎప్పడూ రాలేదట, వాడు బుద్ధుడు.

మనం అందరం గాఢనిద్రలో ఆనందంగా ఉన్నాము కాని జాగ్రదవస్థలో ఆనందంగా ఉండలేకపోతున్నాము. ఎందుకు ఉండలేకపోతున్నాము. మనకు ఎవరు అడ్డువస్తున్నారు.

ఈ నేనే మనకు అడ్డు వస్తోంది. ఈ నేను ఎవరు? ఎక్కడ నుండి వస్తోంది? వాడు నీలోపల నుండే వస్తున్నాడు కాని ఎక్కడ నుండి వస్తున్నాడో మనకు తెలియటం లేదు. ఆ నేను ఎక్కడ నుండి వస్తోందో అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు, అక్కడే సుఖం ఉంది, అక్కడే నిర్వాణస్థితి ఉంది, మూలతలంపు మూలంలోనే మన కంట్రోలర్ ఉన్నాడు. మూలతలంపు దాని మూలంలోనికి వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న వస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది. అది బాహ్యంగా చూసేది కాదు, దానికి లోచూపు నేర్చుకోవాలి. నేను, నేను అనేది మూలతలంపు, దానిని ఉపసంహరించి ఉపసంహరించి దాని మూలంలోనికి పంపితే మూలతలంపు దాని మూలాన్ని ఎప్పుడైతే చూసిందో అప్పుడు మూలతలంపు నశిస్తుంది, దాని మూలంలో ఉన్న బ్రహ్మం నీకు ఎరుకలోనికి వస్తుంది. మూలతలంపు నశిస్తే నువ్వు నశించవు, నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి వస్తుంది. జ్ఞానం కలిగాక అప్పుడు కూడా మీకు దేహం ఉంటుంది కాని ఆ దేహం నేను అని మీరు అనుకోరు, నాకో దేహం ఉంది అనుకొంటారు దేహం నేను అనుకోవటం వేరు, నాకో దేహం ఉంది అనుకోవటం వేరు, మనకు తలంపు లేకపోతే, ఆలోచన లేకపోతే ఏ పని చేయలేము అనుకొంటాము. మీరు కూల్‌గా ఉండండి, క్వయిట్‌గా ఉండండి, రాగద్వేషాలను తగ్గించుకోండి. ఎప్పుడైతే అహంకార రహితుడు అయ్యాడో, వాడి శరీరాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొని ఆ శరీరం ద్వారా ఎప్పుడు ఏ పని ఎలా జరగాలో అంతా సమగ్రంగా, సక్రమంగా చేయిస్తాడు. వాడు ఈశ్వరుడు. అర్జునా పని నాది, గౌరవం నీది అంటాడు పరమాత్మ. నీ దేహం ఏ పని చేయటం కోసం ఈ భూమి మీదకు వచ్చిందో అది నీకు ఇష్టం ఉన్నా జరుగుతుంది, ఇష్టం లేకపోయినా జరుగుతుంది. ఇష్టంగా కనుక నీవు ఆ పని చేస్తూ ఉంటే కొత్తవాసనలు రావు, పాత వాసనలు పోతాయి, ఈశ్వరుని దయకు పాత్రుడవు అవుతావు. ఏది ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతుంది, ఆ టైము వచ్చినప్పుడు ఆ పని జరుగుతుంది కాని ఈ లోపుగా నీవు తొందరపడినా రాదు. ఏవో శారీరక బాధలు ఉండి వాటిని భరించలేక మీ ప్రాణం పోవాలి అనుకొన్నా, ప్రాణం పోదు. ఆ ప్రాణ ప్రయాణ సమయం వచ్చినప్పుడు నీవు ఆగమన్నా ఆగదు, నీవు దానికి లొంగిపోవలసిందే, అది ఈశ్వరనియమం.

ఈ ప్రపంచంలో ఉన్న సంపద అంతా భగవంతుడిదే. ఒకో మనిషికి ఒకో సంపద కొంత కేటాయిస్తాడు. ఇప్పుడు మీ మనవడికి ఐదు రూపాయలు ఇచ్చారు అనుకోండి, దానితో వాడు కొద్దిసేపు ఆడుకొని తిరిగి మీకు ఇచ్చేస్తాడు, మీకు ఇచ్చేటప్పుడు వాడు ఏమనుకొంటాడు అంటే మా తాతయ్యకు ఐదు రూపాయలు ఇచ్చాను అనుకొంటాడు.

మనం చేసేది కూడా అలాగే ఉంది. భగవంతుడు మనకు ఇచ్చింది తిరిగి ఆయనకు ఇచ్చి దానం చేసాము అనుకొంటాము. గుడికి వెళ్ళి పది రూపాయలు వేసి దేవుడికి పది రూపాయలు ఇచ్చాము అనుకొంటాము. ఆ పది రూపాయలు ఆయనే మనకు ఇచ్చాడు అని మనకు తెలియటం లేదు. నీకు ధనం ఇచ్చినా, తెలివి ఇచ్చినా, ఏదైనా వైభవం ప్రసాదించినా అది దేవుడు ఇచ్చిందే, ఆయన అనుగ్రహం లేకుండా నీకు ఏదీ రాదు. నీ తెలివి తేటల వలన ఏదీ రాదు, నువ్వు ఎంత, నీ అహంకారం ఎంత, నీ జీవితంఎంత, నీవు చేసిన కృషి ఎంత. ఒక సామాన్య మానవుడిలో ఎవరిలో లేని వైభవం మీలో ఉంది అనుకోండి, అది దేవుడు ఇచ్చిన వరం, అది మీ సొంతం కాదు, అది మర్చిపోవద్దు. అది దేవుడు మనకు ఇచ్చిన వరం అని ఆయనకు కృతజ్ఞత చూపించటం మానేసి, ఆ గిఫ్ట్ మన సొంతం అనుకొని అహంభావన పెంచుకొని పతనమైపోతున్నాము.

ఈశ్వరసంకల్పానికి భిన్నంగా ఏదీ జరగదు. ప్రతీ సంఘటన కూడా ఈశ్వరసంకల్పం ప్రకారం నడుస్తుంది. మాకు శాంతి కావాలి, మాకు జ్ఞానం కావాలి అని ఎవరైనా భగవాన్‌ను అడిగితే ఉన్నదే అది అనేవారు భగవాన్. నీకు తెలుసున్నా, నీకు తెలియకపోయినా నీ లోపల జ్ఞానం ఉంది. అది తెలిస్తే సుఖం, అది తెలియకపోతే దుఃఖం. నీలోపల ఉన్న జ్ఞానం నీకు అందకుండా ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టాలి, అదే సాధన. మన హృదయం కనుక మనం ఖాళీ చేయగలిగితే ఈశ్వరుడు ఎరుకలోనికి రావటానికి ఒక్క క్షణం కూడా వెయిట్ చెయ్యడు. మనం నోటితో మాట్లాడేమాట, మనం చేసే పని, మనకు వచ్చే తలంపులు ఇవన్నీ సత్వగుణాన్ని పెంచాలి. సాత్వికబుద్ధి లేనివాడిని రంపం పెట్టి కోసినా బ్రహ్మజ్ఞానం కలుగదు. మీరు చేసేపని నిర్మలంగా, కూల్‌గా చేసుకొంటూ వెళ్ళాలి. గుర్తింపులు జోలికి వెళ్ళవద్దు. గుర్తింపులు కోరుకొంటే దేహాభిమానం పెరుగుతుంది. మీరు భక్తి యోగంలో ప్రయాణం చేసినా, కర్మయోగంలో ప్రయాణం చేసినా, జ్ఞానయోగంలో ప్రయాణం చేసినా, అన్ని యోగాలను సమన్వయం చేసుకొంటూ ప్రయాణం చేసినా దేహాభిమానాన్ని తగ్గించు కోవాలి, వాటి ప్రయోజనం అదే.

ఏండ్రిన్ కళ్ళతోటి చూసినా ప్రమాదంలేదు, లోపలకు తీసుకొంటే చాలా ప్రమాదం. అలాగే మనం పొగడ్తలను, విమర్శలను లోపలకు తీసుకొంటే చాలా ప్రమాదం, వాటివలన దేహాభిమానం పెరుగుతుంది. దేహబుద్ధి తగ్గించుకో, ఆత్మబుద్ధి పెంచుకో అని శాస్త్రాలు చెపుతున్నాయి. అది రోజూ చదివినా ప్రయోజనం లేదు, ఎంతోకొంత ప్రాక్టీసు చెయ్యాలి. నా మాయను ఎవరు జయించలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. నా పాదాలను

ఎవడైతే ఆశ్రయించాడో, ఎవడైతే నేనే సర్వస్వం అనుకొని జీవిస్తున్నాడో, ఎవడైతే నా ఇష్టాన్ని వాడి ఇష్టంగా చేసుకొంటున్నాడో అటువంటి భక్తుడికి మాత్రమే నా మాయ దారి ఇస్తుంది కాని అందరికీ మాయ దారి ఇవ్వదు. ఒకోసారి మనకు ఇష్టం లేని పని కూడా మన ద్వారా చేయిస్తాడు. ఈ పని జరుగదు అనుకొన్నప్పడు కూడా ఏదో రకంగా ఆ పని అయిపోతుంది అంటే దాని అర్థం ఏమిటి ఈశ్వరసంకల్పంలో ఉన్నది ఆగదు. ప్రతీ మనిషిని బంధించేది వాడి రూపబుద్ధి, నామబుద్ధి. ఈ దేహం నాది, ఈ పేరు నాది, ఈ మనస్సు నాది, ఈ పరిసరాలు నావి అని ఏదో ఒక శరీరంతోటి, ఒక పేరుతోటి, ప్రాంతంతోటి తాదాత్మ్యం పొందుతాడు. అక్కడనుండే దుఃఖం ప్రారంభమవుతుంది. అసలు దుఃఖం యొక్క సోర్సు అక్కడ ఉంది, అక్కడ కట్ చేయాలి. ఇలా రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నంత కాలం నీవు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా దుఃఖంలో నుండి బయటకు రాలేవు. ఒకవేళ యోగాభ్యాసాలు చేస్తే శారీరకఆరోగ్యం బాగుంటుంది కాని లోపలఉన్న అజ్ఞానం అనే తాడు తెగదు. అజ్ఞానం అంటే ఏమిటి? నువ్వు ఎవడివో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. నీకు వివేకం లేనప్పడు, వైరాగ్యం లేనప్పడు ఇందులో నుండి నీవు బయటకు రాలేవు. భక్తి చేసే పని టెక్నాలజీ చేయలేదు. భక్తి లేకుండా మనకు భగవంతుడితో అనుసంధానం కుదరదు. భక్తి వలన అసాధ్యాలు కూడా సాధ్యాలు అవుతాయి. మన హృదయంలో ఉన్న అంతర్యామితో మనలను అనుసంధానం చేసేది భక్తి మాత్రమే. మీకు భక్తి ఉంటే మీరు చేసే పని సక్రమంగా, శ్రద్ధగా చేయగలరు. భక్తి ఉన్న వాడికి క్రమశిక్షణ వస్తుంది. భక్తి ఉన్న వాడికి ఇహం ఉంటుంది, పరం ఉంటుంది.

మనం ఎంత సేపు బయటకు చూడటం కాదు, లోపలకు కూడా చూసుకోవాలి. మనలో ఉన్న బలహీనతలు ఏమిటి అని జాగ్రత్తగా చూసుకొని, వాటిలో నుండి బయటకు రావటానికి సహాయం చేయమని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన దయ వలన ఆ బలహీనతల నుండి బయటకు వస్తే ఈశ్వరుడు మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఆనందరాజుగారు అన్న మాట నాకు తరచూ గుర్తుకు వస్తుంది. ఈ లోకం ఎంత నిజంగా మనకు కనిపిస్తోందో అంత నిజం కాదు అన్నారు, ఏదో కాకతాళీయంగా ఆయన నోటినుండి ఆ మాట వచ్చింది. మనం ఏమనుకొంటున్నాము ఈ లోకం నిజం, ఈశ్వరుడు అసత్యం అనుకొంటున్నాము. అటువంటప్పడు దైవనామం మనం భక్తితో చేయలేము, నిండు మనస్సుతో అనలేము, ఏదో యాంత్రికంగా చేస్తాము, స్వామి శివానందస్వామి ఏమిచెప్పారు అంటే మీకు ఏదైనా అదృష్టం వస్తుంది అనుకోండి, వస్తే రానివ్వండి దానితో కలిసిపోవద్దు,

మీకు ఏదైనా దురదృష్టం వస్తుంది అనుకోండి, వస్తే రానివ్వండి దానితో కలిసిపోవద్దు. ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తుంది. దానితో కలిసిపోవద్దు. అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా ఏదీ నిలబడదు, కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. నీకు దేహం వచ్చింది, దేహం 1000 సంవత్సరాలు ఉంటుందా? అది కూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. కాలప్రవాహంలో ఏదీ నిలబడదు. అంతా వాసుదేవమయం, అంతా బ్రహ్మమయం. ఎటుచూసినా బ్రహ్మమే, ఉన్నది ఒక్కటే ద్వితీయం అంటూ లేనేలేదు. నీవు జపం చేసి, ధ్యానం చేసి, నిష్కామకర్మ ఆచరించి, విచారణ చేసి, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి నీవు ప్రయత్నం చేసి నీ బుద్ధిలో ఉన్న దోషాల నుండి విడుదలపొందితే ఇదంతా వాసుదేవమయం అని అప్పుడు నీకు తెలుస్తుంది. బహుజన్మల కృషి వలన, సాధన వలన, ఆ పుణ్యబలం వలన ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, ద్వితీయం లేదు అనే అనుభవం నీకు కలుగుతుంది. అదే నీ కడసారి జన్మ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-2006, పాతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కువైట్ వెళ్ళి వచ్చాక వారిలో నేను నేర్చుకొన్నది ఏమిటి అంటే ముస్లింలకు ఎక్కడా రూపం గొడవ, నామం గొడవ లేదు. మసీదులో ఎక్కడా నామం లేదు, రూపం లేదు, అల్లా పటం లేదు, అక్కడ రోజూ నమాజ్ చేసుకొంటారు, వస్తారు. మనకు భగవద్గీత ఎలా ప్రమాణ గ్రంథమో వారికి ఖురాన్ ప్రమాణ గ్రంథము. నేను ముస్లింల ఇంటికి కూడా వెళ్ళాను, వారి ఇంటిలో తల్లితండ్రుల ఫొటోలు కూడా లేవు. ఏదైనా మంచి కార్యక్రమాలు చేసినా గోడల మీద పేర్లు లేవు. భగవదనుభవం పొందటానికి మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం చాలా ముఖ్యం. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. మనం ఏదో ఒక ఆకర్షణకు లోబడిపోతూ ఉంటాము, మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది, సాధనలో మనం ఫెయిల్ అవుతూ ఉంటాము. భగవంతుడు సత్యం, ఈ ప్రపంచం అసత్యం అనేది ముందు మన మనస్సులో గాఢంగా నాటుకోవాలి, ఆ విశ్లేషణ మనకు ఉండాలి. భగవంతుడు సత్యం, మిగతాది అంతా స్వప్నమే అనేది దృష్టిలో పెట్టుకొని ఈలోకంలో మనం వ్యవహారం చేయాలి. నది వెళ్ళి సముద్రంలో ఐక్యమయ్యాక ఇది గోదావరి నీరు, ఇది కృష్ణా నీరు అని ఏమీ ఉండదు. అలాగే మనం హృదయంలో ఐక్యం అయ్యాక రూపం గొడవ, నామం గొడవ ఏమీ ఉండదు. రూపబుద్ధి, నామబుద్ధి మనలను బంధిస్తోంది, ఇదే మన దుఃఖానికి కారణం. సత్పురుషులతో సహవాసం వలన, సత్కర్మ చేయటం వలన రూపబుద్ధి,